జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 04-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 784 పేజీలు: 4 వెల: రూ.7

రావిచంద్రి కోనేరులో మునిగి

విద్యార్థి మృతి

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 3(వార్త): రావిచంద్రి కోనేరు చెరువులో మునిగి మోహనరావు (14) అనే విద్యార్థి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం విశాఖపట్నం నుంచి సుమారు 20 మంది రావిచంద్రి గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. గురువారం వారు గ్రామ సమీపంలో ఉన్న కోనేరు చెరువునకు స్నానానికి వెళ్లారు. వీరిలో మోహనరావు మునిగిపోయాడు. కొన ఊపిరితో ఉన్న మోహన్ రావు ను స్థానికులు లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించగా అప్పటికే మోహనరావు మృతి చెందాడని తేల్చారు. ఈ ఘటనపై సరుబుజ్జిలి పోలీసులను వివరణ కోరగా మోహనరావు తల్లిదండ్రుల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదని, కానీ దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గణేష్ మండపాలకు ..

అనుమతి తప్పనిసరి

[redacted]

- ఆన్‌లైన్‌లో ఉచితంగా అందిస్తున్నాం

-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, సెప్టెంబరు 3(వార్త): జిల్లావ్యాప్తంగా గణేష్ ఉత్సవ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా 'సింగిల్ విండో' విధానంలో ఉచితంగా అనుమతులు మంజూరు చేస్తున్నామని, దరఖాస్తు చేసుకోగానే అధికారులే నేరుగా వచ్చి పరిశీలిస్తారని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనుమతుల విధానంపై శుక్రవారం డివిజన్, ఆ మరుసటి రోజు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. పర్యావరణహిత మండపాలను ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయిలో కమిటీ సభ్యులు ప్రజలను చైతన్యవంతలను చేయాలని కోరారు. అన్నదానాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని లేకుండా చూడాలని, బీఐఎస్ లేదా ఐఎస్ఐ ప్రమాణాలున్న విద్యుత్ పరికరాలనే మండపాలలో వాడాలని, భారీ విగ్రహాలకు సంబంధించి మండపాల వద్ద ఇంజినీరింగ్ అధికారుల నుంచి నిర్మాణ దృఢత్వ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని తేల్చిచెప్పారు. నిమజ్జన ప్రాంతాల్లో తాగునీరు, వెలుతురు, పారిశుధ్యం, క్రేన్లు అందుబాటులో ఉంచాలని, ఈతగాళ్ల వివరాలను ముందే నమోదు చేసుకుని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

పోలీస్ శాఖ 'గణేష్ ఉత్సవ్ 2026' పోర్టల్(**https://ganeshutsav.net)** ద్వారా దరఖాస్తు చేసుకుంటే స్థానిక సంస్థలు, ఇతర శాఖల అధికారులు పరిశీలించి అనుమతులు ఇస్తారని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఊరేగింపుల్లో అధిక శబ్ద తీవ్రత కలిగిన డీజేలపై వినియోగించరాదని కోరారు, మండపాల వద్ద సీసీ టీవీ కెమె రాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రమాదకరమైన ప్రవాహం ఉన్న నదులు, కాలువల్లో నిమజ్జనానికి అనుమతి లేదని, తహసీల్దార్లు, పోలీసులు ముందే గుర్తించిన సురక్షిత ప్రాంతాలు, తాత్కాలిక నిమజ్జన గుండాల వద్దనే నిమజ్జనాలు చేయాలని కలెక్టర్, ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, పలాస డీఎస్పీ భవాని, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులు, ఆన్‌లైన్ ద్వారా పలాస టెక్కలి ఆర్డీవోలు కృష్ణమూర్తి అప్పలరాజు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సింతు సుధాకర్, భాస్కరరావు, డాక్టర్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

శభాష్ సార్..!

- ఏపీపీఎస్సీ పరీక్షల్లో అల్లు అప్పన్న జయకేతనం

-డిప్యూటీ డీఈవోగా ఎంపిక -ప్రస్తుతం ఆయన గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు

- జోన్--2 పరిధిలోని ఉమ్మడి గోదావరి జిల్లాలకు కేటాయింపు

జలుమూరు, సెప్టెంబరు 3 (వార్త): జలుమూరు మండలం శ్రీముఖ లింగం గ్రామానికి చెందిన గణిత ఉపాధ్యాయుడు అల్లు అప్పన్న ఏపీపీ ఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబర్చి డిప్యూటీ డీఈవో (ఉప జిల్లా విద్యాశాఖాధికారి)గా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగు తూనే ఉన్నత లక్ష్యంతో కృషి చేసి డిప్యూటీ డీఈవోగా ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అల్లు అప్పన్న శ్రీముఖలింగం గ్రామంలోనే తన ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యా సాన్ని పూర్తి చేశారు. విద్యారంగంపై ఆసక్తితో ఉపాధ్యాయ వృత్తిని ఎంచు కుని ప్రస్తుతం ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట పాఠశాలలో గణిత స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ ఏపీపీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించి డిప్యూటీ డీఈవోగా ఎంపిక కావడం పలువురికి ఆదర్శంగా నిలిచిందని స్థానికులు పేర్కొన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే ఉన్నత లక్ష్యా లను సాధించవచ్చని ఆయన నిరూపించారని గ్రామస్తులు అభినందిం చారు. జోన్--2 పరిధిలోని గోదావరి జిల్లాలకు ఆయనను కేటాయించి నట్లు సమాచారం. డిప్యూటీ డీఈవోగా ఎంపికైన అల్లు అప్పన్నను శ్రీముఖ లింగం గ్రామస్తులు, స్నేహితులు, సహచర ఉపాధ్యాయులు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కిడ్నీ రక్కసికి విద్యార్థి బలి

- సోంపేటలో విషాదం

సోంపేట, సెప్టెంబరు 3(వార్త): కిడ్నీ మహమ్మారి కాటుకు సోంపేటకు చెందిన ఓ విద్యార్థి జీవితం బలైపోయింది. 20 ఏళ్ల వయసులోనే కిడ్నీ వ్యాధికి గురైన పట్టణంలోని శ్రీశయన వీధికి చెందిన తోట మనోహర్ అనే డిగ్రీ విద్యార్థి గురువారం ఉదయం పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్లో తుది శ్వాస విడిచాడు. వైసిపి నాయకుడు తోట ఢిల్లీరావు, దమయంతి కుమారుడు మనోహర్‌కు సుమారు ఏడాది క్రితం కిడ్నీ పాడయింది. ఈ మేరకు గుర్తించిన వైద్యులు ఇప్పటికే ఆరేడు సార్లు డయాలసిస్ కూడా చేపట్టారు. మనోజ్‌కు కిడ్నీ దానం చేసేందుకు తల్లి దమయంతి కూడా సిద్ధమైంది. ఈ నెల 9న హైదరాబాదులోని ఒక ప్రైవేట్ ఆసు పత్రిలో కిడ్నీ మార్పిడి చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంతలోనే విధి వక్రించింది. బుధవారం మధ్యాహ్నం నుంచి ఆయాసం మొదలు కావడంతో శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు వైద్యుని వద్దకు తీసుకు వెళుతుండగా పరిస్థితి సీరియస్ గా మారడంతో మధ్యలోనే పలాస కిడ్నీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం కన్నుమూశాడు. సమాచారం తెలియడంతో పట్టణంలో విషాదం నెలకొంది. ఒకే ఒక్క కుమారుడు ఇలా చిన్న వయసులోనే దూరం కావడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపించింది. సోంపేటతో పాటు చుట్టుపక్కల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు అంత్యక్రియలకు హాజరయ్యారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాస్,కూటమి నాయకులు బీన ఆనంద్, రెళ్ల నారాయణ, దేవాడ మోహన్‌రావు, పొడుగు కామేష్ తదితరులు హాజరై బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

అప్పనంగా కొట్టేద్దామని..!

-పారసాంబలో రూ.30 కోట్ల ప్రభుత్వ భూమిపై అక్రమార్కుల కన్ను - గ్రేజింగ్ ల్యాండ్‌లో వరి సాగు

-ఆక్రమణకు పావులు

-సర్వే నంబరు 183లో 1.5 ఎకరాలపై యత్నం

-నోటీసులు జారీ, కేసు నమోదు

పలాస, సెప్టెంబరు 3 (వార్త):

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న విలువైన ప్రభుత్వ భూమిపై ఆక్రమణదారుల కన్ను పడిందన్న ఆరోపణలు పారసాంబలో కలకలం రేపుతున్నాయి. పలాస మండలం పారసాంబలోని సర్వే నంబరు 183లో సుమారు 1.5 ఎకరాల ప్రభుత్వ గ్రేజింగ్ ల్యాండ్ ఉంది. కోట్లాది రూపాయల విలువైన ఈ భూమిలో కొందరు వ్యక్తులు వరి సాగు చేపట్టడం వివాదానికి దారితీసింది.

గ్రేజింగ్ భూమిలో సాగు చేస్తున్న నేపథ్యంలో ..

పశువుల మేత కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిలో ఎలాంటి హక్కులు లేకుండానే సాగు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. తొలుత సాగు పేరుతో భూమిని వినియోగించి.. క్రమంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో ఈ భూమికి మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉందని.. ప్రస్తుత విలువ సుమారు రూ.30 కోట్ల వరకు ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.

రెవెన్యూ సిబ్బంది అండపై ఆరోపణలు

ఇంత విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కొందరు భూ ఆక్రమణ దారులు పావులు కదుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమణలకు కొందరు రెవెన్యూ సిబ్బంది సహకరిస్తున్నారంటూ స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నోటీసులు.. క్రిమినల్ కేసు

ప్రభుత్వ భూమి ఆక్రమణ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. గ్రేజింగ్ ల్యాండ్‌లో సాగు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేసినట్లు పలాస తహశీల్దార్ శ్రీదేవి తెలిపారు. ఈ వ్యవహారంపై పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కంచె ఏర్పాటు చేస్తాం : పలాస తహసీల్దార్ శ్రీదేవి

ప్రభుత్వ పచ్చికబయలును భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా సంరక్షించేందుకు చర్యలు చేపడతామని తహశీల్దార్ శ్రీదేవి తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి ప్రభుత్వ భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో పాటు సంరక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

ఒక్క అవకాశం... కొత్త జీవితానికి నాంది..!

- కష్టపడి జీవించాలన్నదే కోరిక
-ట్రాన్స్‌జెండర్ దండు నీలిమ ఆకాంక్ష
- అధికారుల చొరవతో విద్య కొనసాగింపు
- విధుల్లో నిబద్ధతకు ప్రశంసలు

పలాస, సెప్టెంబరు 3 (వార్త): జీవితం ఎన్నోసార్లు పరీక్షించినా... ఆత్మవిశ్వాసం ఆమెను వెనక్కి లాగలేదు. సమాజం చూపిన చిన్నచూపును ఎదుర్కొంటూ.. అవకాశాల కోసం ఎదురుచూసిన ఆమెకు ఓ ఉద్యోగం కొత్త ఆశను చూపించింది. చేతిలో చీపురు పట్టుకుని పట్టణ పరిశుభ్రత కోసం శ్రమిస్తూ.. మరోవైపు చదువును కొనసాగిస్తూ తన జీవితానికి తానే కొత్త బాట వేసుకుంటున్నారు ట్రాన్స్‌జెండర్ దండు నీలిమ.

కష్టాల మధ్య బాల్యం..

చిన్ననాటి నుంచే నీలిమకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. కుటుంబ, సామాజిక పరిస్థితుల కారణంగా చదువును మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. సాధారణ జీవితం గడపాలని, తన కాళ్లపై తాను నిలబడాలని ఉన్నా.. పరిస్థితులు అందుకు అనుకూలించలేదు. అయినా నిరాశకు లోనుకాకుండా జీవనోపాధి కోసం తన వంతు ప్రయత్నం చేస్తూనే వచ్చారు.

చీపురు చేతబట్టి.. పట్టణ సేవలో

ఆమె పట్టుదలను గుర్తించిన పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అధికారులు పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేసే అవకాశం కల్పించారు. అప్పటి నుంచి పట్టణ పరిశుభ్రతలో తన వంతు బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారు. ఏ పని చిన్నది కాదనే భావనతో.. కష్టపడి పనిచేస్తే గౌరవంగా జీవించవచ్చని నిరూపించేందుకు ముందుకు సాగుతున్నారు.

అధికారుల ప్రోత్సాహంతో

మళ్లీ చదువు బాట

ఉద్యోగంతో జీవనోపాధి లభించినా.. చదువుపై ఉన్న ఆసక్తిని నీలిమ వదులుకోలేదు. ఆమె పట్టుదలను గుర్తించిన అధికారులు విద్యను కొనసాగించాలని ప్రోత్సహించారు. దీంతో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే చదువును కొనసాగించేందుకు ఆమె అడుగులు వేస్తున్నారు.

'కష్టపడి జీవించాలనేదే కోరిక'

"కష్టపడి జీవించాలన్నదే నా కోరిక. నాకు అవకాశం కల్పించి ఉద్యోగం ఇచ్చిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, అధికారులు, నన్ను ప్రోత్సహిస్తున్న తోటి సిబ్బందికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. చదువును కొనసాగించి మరింత ముందుకు వెళ్లాలనుకుంటున్నాను" అని నీలిమ తెలిపారు.

చిన్నచూపు కాదు..

చేయూత కావాలి

ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల పట్ల సమాజంలో ఇప్పటికీ ఉన్న వివక్ష వారి జీవితాలకు అడ్డంకిగా మారుతోందని, సానుభూతి చూపడం కంటే వారికి అవకాశాలు కల్పించడం, గౌరవించడం, ప్రోత్సహించడం అవసరం. ఒక ఉద్యోగం, కొంత ప్రోత్సాహం, నాలుగు మంచి మాటలు వారి జీవితాల్లో ఎంతటి మార్పును తీసుకురాగలవో నీలిమ ప్రస్థానం చాటుతోంది.

విధుల్లోనే తన గుర్తింపు..

తెల్లవారుజామునే విధులకు హాజరై పరిసరాల పరిశుభ్రతకు కృషి చేస్తున్న నీలిమ.. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారు. వ్యక్తిగత జీవితంలో ఎదురైన కష్టాలను పక్కనపెట్టి.. విధినే ప్రధానంగా భావిస్తున్నారు. ఆమె పనితీరును గమనించిన తోటి సిబ్బంది సైతం ప్రోత్సహిస్తున్నరు.

ఒక్క అవకాశం.. ఎన్నో ఆశలు

జీవితంలో ఎదురైన ప్రతికూలతలు తన ప్రయాణాన్ని ఆపలేవని నీలిమ నిరూపిస్తున్నారు. ఒకప్పుడు అవకాశాల కోసం ఎదురుచూసిన ఆమె.. ఇప్పుడు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ, చదువును కొనసాగిస్తూ స్వయం సమృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు.

నీలిమకు లభించిన ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాదు.. స్వాభిమానంతో జీవించాలన్న ఆమె ఆకాంక్షకు లభించిన ఓ అవకాశం. అధికారుల ప్రోత్సాహం, సహచరుల చేయూత ఆమెకు కొత్త ఆత్మవిశ్వాసాన్ని అందిస్తున్నాయి. ఇలాంటి అవకాశాలు మరింత మంది ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు లభిస్తే.. వారు సైతం తమ సామర్థ్యాన్ని నిరూపించుకుని సమాజంలో గౌరవంగా నిలబడగలరనడానికి నీలిమ ప్రస్థానం ఓ ఉదాహరణగా నిలుస్తోంది.

సీతారాంనకు ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పరామర్శ

జి.సిగడాం, సెప్టెంబరు 3(వార్త): మెట్టవలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కామోజుల సీతారాం ఇటీవల అనారోగ్యం చెంది ఆసుపత్రిలో శస్త్ర చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) గురువారం ఆయనను పరామర్శించారు. వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అయెనతో పాటు ఎపీఎస్ అధ్యక్షులు బెవర జగన్నాధరావు, ఎచ్చెర్ల ఎఎంసీ ఉపాధ్యక్షులు బురాడ వెంకటరమణ, మండల బీజేపీ అధ్యక్షులు పైల విష్ణుమూర్తి,వజ్జపర్తి రఘురాం,పలిశెట్టి సూర్యనారాయణ, బెవర బాలక్రిష్ణ,పొగిరి అక్కలనాయుడు,టంకాల విజయ్ కుమార్, పొగిరి దాసరధి, టంకాల రమణ,కిల్లారి శ్రీరాములు, లాబాన మహేష్,ముల్లు గొల్ల భాను, టంకాల అక్కలనాయుడు, టంకాల వాసు, తదితరులు ఉన్నారు.

వైభవంగా వినాయక మండప పందిరిరాట

- 12 అడుగుల భారీ వినాయక విగ్రహం

వితరణ చేసిన కేవీ గోపాల్ దంపతులు

పలాస, సెప్టెంబరు 3 (వార్త): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు పలాసలో శ్రీ వరసిద్ధి వినాయక పూజా కమిటీ ఆధ్వర్యంలో సన్నాహాలు ప్రారంభమయ్యాయి. పలాస ఎంపీడీవో కార్యాలయ కూడలి వద్ద ఏర్పాటు చేయనున్న వినాయక మండపానికి పందిరిరాట ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరిరాటను ప్రతిష్ఠించారు. ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా మండపంలో సుమారు 12 అడుగుల ఎత్తైన భారీ సాంప్రదాయ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త కే.వి.గోపాల్ దంపతులు ఈ విగ్రహాన్ని వితరణగా అందజేశారు. పందిరిరాట ప్రతిష్ఠాపన సందర్భంగా గోపాల్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రాధాన్యంతో సెప్టెంబరు 14 నుంచి 22 వరకు వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మండప ప్రాంగణంలో సినిమా పాటలు, అనవసర హంగామాకు తావులేకుండా భక్తిభావాన్ని పెంపొందించేలా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబరు 23న వినాయక నిమజ్జన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.జయంత్‌కుమార్, సీపాన వేమనరావు, రోనంకి సూర్యారావు, లక్ష్మణరావు, సింగుపురం రాము, బాబూరావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

సోంపేట, సెప్టెంబరు 3 (వార్త): కర్తలపాలెంలో గురువారం చంద్రన్న సంచార చికిత్స సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కొర్లాం పిహెచ్ సి వైద్యాధికారిని డాక్టర్ రోషిని హాజరైన రోగులను పరిశీలించారు. బిపి, షుగర్, హెచ్ బి,గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను 104 సిబ్బంది అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మణిమాల, ఏఎన్ఎం సంధ్యారాణి, హెల్త్ అసిస్టెంట్ జయవర్మ, రాము, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఎంపీపీ దాసు సేవలు అమూల్యం

సోంపేట, సెప్టెంబరు 3(వార్త): సోంపేట ఎంపీపీగా గడచిన ఐదేళ్లలో మండలాభివృద్ధికి మీరు చేసిన కృషి ఎనలేనిదని, మీ సేవలు అమూల్యమైనవని ఈ మండలం సిరి మామిడి మాజీ సర్పంచ్ బైపల్లి ఈశ్వరి కామేశ్వరరావు దంపతులు డాక్టర్ నిమ్మన దాసును కొనియాడారు. గురువారం ఆయన చాంబర్ లో కలిసి దుస్సాలువ కప్పి సత్కరించారు. ముఖ్యంగా పంచాయతీకి కేటాయించిన అభివృద్ధి పనులు ద్వారా గ్రామం ఎంతగానో అభివృద్ధి సాధించిందని అన్నారు. అలాగే ఇతర గ్రామపంచాయతీలను కూడా అభివృద్ధి చేయడంలో ఎనలేని కృషి చేశారన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు

పలాస, సెప్టెంబరు 3 (వార్త): కామ్రేడ్ కుమారన్న, కామ్రేడ్ సీతారాముల పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై సమరశీల ప్రతిఘటన పోరాటాలను నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగించడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం వద్ద గురువారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ సెప్టెంబరు 10న పలాస మండలం పెదగంతర్లో కామ్రేడ్ కుమారన్న, కామ్రేడ్ సీతారాముల 28వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దేశంలో దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో వేలాది మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని అన్నారు. అమరవీరులు నెలకొల్పిన త్యాగం, నిబద్ధత, పోరాట స్ఫూర్తి ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ద

శ్రీకాకుళం విప్లవోద్యమంలో అమరులైన 360 మందికి పైగా వీరులను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ.. అమరవీరులను స్మరించుకోవడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గొరకల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంకల పాపన్న, జిల్లా కార్యదర్శి రాపాక మాధవరావు, ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కన్వీనర్ సార జగన్, గర్తం కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యతను నిర్మూలించడమే లక్ష్యం

- అక్షరాస్యతే అభ్యున్నతికి మార్గం -ఏపీఎం గొడబ ప్రసాదరావు

60వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ పక్షోత్సవాలు
ULLAS
సెర్ప్ - డిఆర్‌డిఎ
వజ్రపుకొత్తూరు మండలం

వజ్రపుకొత్తూరు/మందస, సెప్టెంబరు 3(వార్త): నిరక్షరాస్యత నిర్మూలించడమే లక్ష్యమని, ప్రతీ ఒక్కరూ చదువుకుని అక్షరాస్యులుగా మారాలని డీఆర్ డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు గొడబ ప్రసాదరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని నువ్వలరేవు గ్రామ పంచాయతీ 60వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ పక్షోత్యవాలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహిళా లెర్నర్స్ తో ఏపీఎం గొడబ ప్రసాదరావు మాట్లాడుతూ ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులందరూ అక్షరాస్యులుగా మారాలని పిలుపునిచ్చారు. అక్షరాస్యతే అభ్యున్నతికి మార్గమని, నిరాక్ష్యరాసతను నిర్మూలించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మండలంలోని ప్రతీ పంచాయితీలో నిరక్షరాస్యత నిర్మూలించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం గొడబ ప్రసాదరావు, వివోఏలు జానకి, కమల, గ్రామ సంఘం అధ్యక్షురాలు సోంపమ్మ, అభ్యాసకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలకు వైద్య విజ్ఞాన సదస్సు

పలాస, సెప్టెంబరు 3 (వార్త): గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీలు ఎప్పటికప్పుడు వైద్య విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి సూచించారు. సామాజిక గ్రామీణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం పలాసలోని కీర్తన ఫంక్షన్ హాల్‌లో ఆర్‌ఎంపీ, గ్రామీణ వైద్యులకు వైద్య అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రముఖ స్పైన్ స్పెషలిస్ట్ డాక్టర్ సంపత్‌రావు మాట్లాడుతూ 40 ఏళ్లు పైబడిన వారిలో అధికశాతం మంది కీళ్ల, వెన్నుపూస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ఇలాంటి సమస్యలకు అందుబాటులో ఉన్న శాస్త్రీయ వైద్య విధానాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బాధితులకు ప్రాథమిక స్థాయిలో ఎలాంటి సహాయం అందించాలి, ఎప్పుడు నిపుణులైన వైద్యులను సంప్రదించాలి అనే అంశాలను గ్రామీణ వైద్యులకు వివరించారు. వైద్యుల సూచన లేకుండా ఫెరాయిడ్లు (స్టెరాయిడ్లు) వినియోగించరాదని సూచించారు. జంగం జోషి మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు తమ పరిధి దాటి వైద్యం చేయరాదని సూచించారు. ప్రాథమిక వైద్య సేవలపై క్వాలిఫైడ్ వైద్యులతో త్వరలో కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తద్వారా గ్రామీణ వైద్యులు ఆధునిక వైద్య విధానాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఉపాధ్యక్షుడు అల్లాడ త్రినాథరావు, సలహాదారు కోన ప్రకాష్, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి సుగ్గు రాజు, పలాస డివిజన్ అధ్యక్షుడు సవరయ్య, ఉపాధ్యక్షుడు నీలకంఠం, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్‌రావు, జనరల్ సెక్రటరీ మేఘనాథ్, సిటీ అధ్యక్షుడు మోహన్‌రావు, ఈసీ సభ్యులు కుమార్‌రాజా, కృష్ణారావు, రమేష్, రాజు, ఉషా మహారాణి, సుమారు 200 మంది గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

SRI
SOUMYA HOSPITAL
మీ నమ్మకం... మా బాధ్యత...
KUMAR
క్షేమ సంఘం

గిరిజన ప్రాంతాల్లో బ్రిడ్జి పనుల నాణ్యత పరిశీలన

- గ్రామాల్లో పర్యటించిన ఈఈ రమాదేవి
- నిబంధనల మేరకు బిల్లులు చెల్లింపు

మందస, సెప్టెంబరు 3(వార్త): మందస మండలంలోని గిరిజన ప్రాంతాల్లో నిర్మించిన బ్రిడ్జిలను ఐటీడీఏ ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ పి.రమాదేవి(సీతంపేట) గురువారం పరిశీలించారు. చీపి బీటీ రోడ్డు నుంచి బుడంబో బీటీ రోడ్డు మధ్య రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జి పనుల నాణ్యతను ఆమె తనిఖీ చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో నిర్మాణంలో ఉపయోగించిన మెటీరియల్, పనుల నాణ్యత, నిర్మాణ ప్రమాణాలు తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ రమాదేవి మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయినందున నాణ్యతను పరిశీలించిన అనంతరం నిబంధనల మేరకు బిల్లులు చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు. అదేవిధంగా దాలసరి బీటీ రోడ్డు నుంచి బుడంబో బీటీ రోడ్డు మధ్య రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన మరో బ్రిడ్జి పనుల నాణ్యతను కూడా ఈఈ రమాదేవి పరిశీలించారు. నిర్మాణ పనులు నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టారా అనే అంశాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు, నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు నిర్ణీత ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ కుమార్, ఏఈ, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తులసి యాత్ర

కంచిలి, సెప్టెంబరు 3(వార్త): కంచిలి శ్రీ రాధాకృష్ణ దేవాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం కంచిలి లో నిర్వహించిన తులసి యాత్ర ఘనంగా జరిగింది. శుక్రవారం జన్మాష్టమి పురస్కరించుకొని కృష్ణ భక్తులు ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెస్ట్ బెంగాల్ కు చెందిన హరే కృష్ణ పాదయాత్ర ఇన్చార్జ్ రసత్వవ దాస్, బరంపురం ఇస్కాన్ ఇంచార్జ్ భువన్ మోహన్ ప్రభూజి తదితరుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా జరిగిన ప్రవచన కార్యక్రమంలో మాట్లాడారు. శ్రీకృష్ణుని జీవితం ఎంతో ఆదర్శవంతమైనదని అన్నారు. శ్రీకృష్ణుని అవతారం సమాజానికి సరైన దిక్సూచి అని పేర్కొన్నారు. చీకట్ల నుంచి వెలుగులోకి సరైన మార్గాన్ని చూపే కృష్ణ భగవానుని అవతారం ఈ భూమండలంలో ఒక విశిష్టమైనదని పేర్కొన్నారు. అంతకుముందు కంచిలి మెయిన్ రోడ్డు మీదగా నిర్వహించిన తులసి యాత్రకు విశేష స్పందన లభించింది. అనంతరం అన్నప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాలిన లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

5న రట్టిలో ప్రపంచ జానపద దినోత్సవం

-పలు పోటీలను నిర్వహించనున్న కళాకారులు
- విజయవంతం చేయాలని నిర్వాహకుల పిలుపు

మందస, సెప్టెంబరు 3(వార్త): మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రట్టిలో ఈ నెల 5న ప్రపంచ జానపద దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు రట్టిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అంతరించిపోతున్న ప్రాచీన జానపద కళలు, విచ్ఛిన్నమౌతున్న భారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ-వీటి పునరుజ్జీవనం కోసం మనం తీసి కోవాల్సిన చర్యలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా రట్టి గ్రామంలో సాయంత్రం 6గంటల నుంచి జిల్లా స్థాయి జానపద సామాజిక పాటల పోటీలు నిర్వహించనున్నారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మామిడి కృష్ణారావు మాట్లాడుతూ శ్రమ జీవుల కష్ట సుఖాల నుంచి పుట్టి వచ్చినదే జానపదం.. ఇది మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ మానవతా విలువలను మానవ సంబంధాలను పెంపొందిస్తుందన్నారు. ఆదిమానవుడు తనకు చదువు రాకపోయినా కేవలం ప్రకృతి అందాలను ప్రవళించి పాడిన జానపదాలు మొదలు సుబ్బారావు పాణిగ్రాహి రాసిన జముకుల కథ, వంగపండు ప్రసాదరావు రాసిన భూభాగోతంలాంటి జానపదాలు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాయన్నారు. ఆధునిక పోకడలో చెవులు తూట్లు పడుతుంటే, అర్ధనగ్న నృత్యాలు వికారాలు పెడుతుంటే జానపదుల రీతులను స్వాగతించాలని, మన పూర్వీకులు నుంచి వచ్చిన ప్రాచీన జానపద కళారూపాలు పరిరక్షించాలని సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక పని చేస్తుందన్నారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రపంచ జానపద దినోత్సవానికి అందరూ హాజరు కావాలని, కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఆయనతో పాటు సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక కోశాధికారి గొరకల లోకేశ్వరరావు, ముఖ్య సలహాదారుడు దున్న రామారావు, కార్యవర్గ సభ్యులు పులారి పితంబరం, తలగాన గున్నయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


శ్రీ శ్రీ శ్రీ రట్టి వల్లభనారాయణ స్వామి ఆశీస్సులతో
సిక్కోలు జానపద సాహిత్య కళా వేదిక
మా యాస - మా పాట
ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా
విద్యార్థులకు వ్యాసరచన పోటీలు
తేదీ 05-09-2026 శనివారం
సమయం మధ్యాహ్నం 2 గంటల నుండి
స్థలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, రట్టి
అంశము
బహుమతులు
ప్రథమ బహుమతి: ₹1,500/- + జ్ఞాపిక
ద్వితీయ బహుమతి: ₹1,000/- + జ్ఞాపిక
తృతీయ బహుమతి: ₹500/- + జ్ఞాపిక
న్యాయనిర్ణేతలు
కార్యవర్గం
9618905939
9676701457
9963708029

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

సాడిస్తారా?

- స్థానిక ఎన్నికల్లో ఒక్క ఏకగ్రీవం జరిగినా అభ్యర్థిత్వం డౌటే!
- 'శ్యాం 'ముందు సవాళ్లు!
- వైస్సార్సీపీ అధినేత జగన్ అల్టిమేటంతో మల్లగుల్లాలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 2(వార్త): జో జీతా వహీ సికిందర్……ఇదేదో సినిమా డైలాగ్ కాదు సాక్షాత్తు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలకు ఇచ్చిన హెచ్చరిక. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్కచోట ఏకగ్రీవం జరిగిన రాబోయే జనరల్ ఎన్నికల్లో అభ్యర్థిగా పక్కకు తప్పుకుంటారని ఇందులో ఏమాత్రం డౌటే లేదని ముక్కుసూటిగా తేల్చి చెప్పేశారు ఇది రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ఎలా ఉన్నా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శ్యాం ప్రసాద్ రెడ్డి ముందు పెద్ద సవాలు విసిరినట్లు అయింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు ఎక్కువ స్థానాలు గెలుస్తారో వారే రాబోయే జనరల్ ఎన్నికల్లో అభ్యర్థిగా ఉంటారని గెలుపు ఉన్నచోటే సికిందర్ లా నిలబడతారని అల్టిమేటం రావడంతో మల్లగుల్లాలు పడుతున్నారు. శ్యాం ప్రసాద్ రెడ్డి బాధ్యత స్వీకరించి న నుండి ఏడాది కాకముందే తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమం విజయవంతం చేస్తూ అందర్నీ కలుపుకొని వెళ్తున్నారు. అటు అధికార పక్షానికి ప్రభుత్వానికి తన పోరాటాలతో కునుకు లేకుండా చేస్తున్నారు.ఇన్నాళ్లు ఒక లెక్క ఇప్పుడు ఒక లెక్క అన్న చందం గా శ్యాం ప్రసాద్ రెడ్డి అధికార పక్షాన్ని ఇరుకునపట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇటు పార్టీ పరంగా దూసుకుపోతున్నప్పటికీ మున్సిపాలిటీలో సరైన సహకారం లభించలేదని తెలుస్తోంది. పార్టీపిలుపు ఇచ్చిన ఏ కార్యక్రమం లో కూడా పూర్తిస్థాయిలో మున్సిపాలిటీ నుండి ద్వితీయ శ్రేణి నాయకులు సహాయ సహకారాలు అందించడం లేదని తెలుస్తోంది. ఇటీవలి చాలా క్లిష్టం అయిన 'సర్ ' లో పకడ్బందీగా పాల్గొనాలని చురుగ్గా పనిచేయాలి పార్టీ నుండి పదేపదే ఆదేశాలు ఇచ్చిన మున్సిపాలిటీ నుండి పూర్తిస్థాయిలో సర్ లో పాల్గొనలేదని తెలుస్తోంది. సర్ లో నాలుగు మండలాల్లో పార్టీ కార్యకర్తలు విజయవంతంగా పాల్గొనగా మున్సిపాలిటీలో కూటమి నాయకులతో పోలిస్తే వైఎస్ఆర్సిపి కార్యకర్తలు వెనకంజిలోనే ఉన్నారని ఉన్నారని తెలుస్తోంది. రెండు మూడు చోట్ల మినహా మిగతా చోట్ల బూత్ స్థాయి లో సర్ లో నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు సమాచారం.ఇది ఎవరు పనో మనకు ఎందుకు లే అన్ని పెడ చెవిన పెట్టిన వారికీ ఇప్పుడు అదే రానున్న ఎన్నికలు లో ముఖ్యం అయి కూర్చుంది.ఇది కాస్త శ్యాం ప్రసాద్ రెడ్డికి ఇరుకున పెట్టే అంశంగా మారింది. ఇదే విషయమై మున్సిపాలిటీలో ఏకగ్రీవం జరిగే అవకాశాలు ఎక్కడా లేనప్పటికీ గతంలో ఒకేసారి జగన్మోహన్ రెడ్డి ఇదే తరహా సమావేశం నిర్వహించి ఇదే తరహా హెచ్చరిక జారీ చేసిన సందర్భంలో రానున్న ఎన్నికల్లో శ్యాం ప్రసాద్ రెడ్డి ని పక్కకు తప్పించాలంటే ఎక్కడో చోట ఏకగ్రీవం చేయించాలని ప్రయత్నం సాగిస్తున్నట్లు సమాచారం. కవిటి మండలం లో ఓ పంచాయతీలో ఇదే తరహా ప్రయత్నం చేయగా బెడిసికొట్టింది అని తెలిసింది.ఇక మున్సిపాలిటీ విషయానికి వస్తే కత్తి మీద సాముల మారింది. నియోజకవర్గం చేజారిన ఆ పార్టీకి పెద్దగా ఆశ్చర్యం కలిగించదు కానీ మున్సిపాలిటీ చేజారితే శ్యాం పదవి కి ఎసరు వచ్చినట్లే! ఆరు పర్యాయాలు ఎన్నికల జరగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తర్వాత వరుసగా రెండుసార్లు ఇచ్ఛాపురం మున్సిపాలిటీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది.ఈ నేపథ్యంలో ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి ఆ సెంటిమెంట్ ని కొనసాగించాల్సిన అవసరం, బాధ్యత రెండు శ్యాంపై ఉన్నాయి.మున్సిపాలిటీ నాయకులు నుండి సహకారం లేకుండా మున్సిపాలిటీ ని ఎలా గెలిపించాలా అనే ప్రయత్నంలో శ్యామ్ తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు. మరోవైపు కొంతమంది మున్సిపల్ నాయకులు కూటమి నాయకులతో అటు బహిరంగంగా ఇతర రహస్యంగా మంతనాలు సాగించి చెట్టా పట్టా లేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏదైనా ప్రశ్నిస్తే స్నేహం వేరు రాజకీయం వేరు అంటున్నారు. తీరా చూస్తే కూటమి నేతలతో రహస్య ఒప్పందం కుదుర్చుకొని సీటు కోసం గెలుపు కోసం కొత్త రకం మైండ్ గేమ్ ఆడుతూ అయితే నేను గెలవాలి లేదా మీరు గెలవాలి అనే సందర్భంగా కుమ్మకు రాజకీయాలకు తెరలేపినట్లు సమాచారం. శ్యామ్ పదవికే ఎసరు పెట్టే ఈ మున్సిపల్ ఎన్నికలు ఏ విధంగా సవాల్ లను అధిగమించి ముందుకు వెళ్తారో వేచి చూడాలి.

నేడు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఇచ్ఛాపురంలో పర్యటన

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 3 (వార్త): కేంద్ర పౌరు విమానం శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు రాష్ట్ర ప్రభుత్వ విప్ శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ బాబు లు కలిసి శుక్రవారం ఇచ్ఛాపురం లో పర్యటిస్తారు. ఉదయం కంచిలి మండలం పోలేరులో తారు రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమం పాల్గొంటారు.. కొల్లూరు పంచాయతీ గుండం గ్రామంలో తెలుగుదేశం పార్టీలో చేరికల కార్యక్రమం ఉంది. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో రాజావారి మైదానంలో కోల్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టనున్న ఇండోర్ స్టేడియం భూమి పూజ చేసి శంకుస్థాపన చేయనున్నారు. ఇచ్ఛాపురం శనివారం సంత దగ్గర,రత్తకన్న ఎల్ సి గేటు దగ్గర అండర్ పాస్ బ్రిడ్జిపనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం కవిటి మండలం బైరిపురం గ్రామపంచాయతీలో. బి ఎస్ ఎన్ ఎల్ సెల్ టవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. రాజపురం గ్రామపంచాయతీలో నూతనంగా మంజూరైన భవనంకు శంకుస్థాపన చేయనున్నారు. భోజన విరామం అనంతరం కవిటి మండలం. ప్రగడ పుట్టుగా గ్రామంలో కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టుకొట్టే కార్యక్రమంలో పాల్గొంటారు.

వినాయక నవరాత్రులకు శుభరాట

కంచిలి, సెప్టెంబరు 3(వార్త): ఎస్ఆర్‌సి పురంలో రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలకు గురువారం గ్రామస్తులు శుభరాట వేశారు. ప్రతి ఏటా ఎస్సార్సీపురంలో గ్రామస్తులు ఐక్యంగా వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేసి పది రోజుల ముందుగానే శుభరాట వేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, పాల్గొన్నారు.

బహడపల్లి గ్రామ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

మందస, సెప్టెంబరు 3(వార్త): మహిళా స్వయం సహాయక సంఘాలతో ఏర్పాటు అయిన గ్రామ సంఘాల్లో జరుగుతున్న వార్షిక మహా జనసభ సమావేశంలో పాలక వర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుని నిర్ణయించుకున్నట్లు వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. గురువారం బహడపల్లిలో వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ మంగమ్మ ఆధ్వర్యంలో జరిగిన జనరల్ బాడీ మీటింగ్ లో అధ్యక్షురాలుగా బి.పుష్పలత, కార్యదర్శిగా ఎస్.చామంతి, కోశాధికారిగా ఏ.రజినీ, ఉపాధ్యక్షురాలుగా ఎస్. ఊర్వశి, ఉపకార్యదర్శిగా ఎస్.గంగమ్మ ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం వీఓఏ ఎస్.మాధవరావుతో పాటు స్వయం సహాయక సంఘాల లీడర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు .

నేడు వాసుదేవుని సన్నిధిలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు

మందస, సెప్టెంబరు 3(వార్త): మందసలోని శ్రీవాసుదేవ ఆలయంలో ఈ నెల 4న శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు శ్రీవాసుదేవ సేవా సమితి ప్రతినిధులు చెప్పారు. శుక్రవారం శ్రీవాసుదేవ స్వామి ఆలయంలో "శ్రీ కృష్ణాష్టమి" వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణస్వామికి ఊంజల్ సేవ, అర్చనలు, ప్రత్యేక నివేదనలు, ఉట్టి సంబరం తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతాయన్నారు. భగవద్బంధువులందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవానికి మరింత శోభని చేకూర్చాలని కోరారు. శ్రీ వాసుదేవ సేవా సమితి సభ్యులు, కైంకర్యాలు సమర్పించడానికి ఆసక్తి ఉన్న ఇతర భక్తులు ఆలయ వర్గాలను సంప్రదించి, ఆలయ బ్యాంకు ఖాతాకు లేదా నేరుగా ఆలయం వద్ద కానీ తమ కైంకర్యాలు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు అనిల్ స్వామి.9390643145 సంప్రదించాలని సూచించారు.



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా రామారావు

- జలుమూరు మోడల్ ప్రాథమిక పాఠశాలకు అరుదైన గౌరవం
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సీఎం, విద్యాశాఖ మంత్రి నుంచి పురస్కారం
- ఎంఈవోలు, ఉపాధ్యాయుల అభినందనలు

జలుమూరు, సెప్టెంబర్ 3 (వార్త): జలుమూరు మండల కేంద్రంలోని మోడల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు రామారావు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. విద్యా రంగంలో ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిసింది. గురువారం స్థానిక పాఠశాలలో రామారావు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ నెల 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేయనున్నట్లు తనకు సమాచారం అందిందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సమగ్ర వికాసానికి రామారావు చేస్తున్న కృషికి ఈ పురస్కారం దక్కడం పట్ల ఉపాధ్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపిక కావడం జలుమూరు మండలానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామారావును మండల విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు సేవలందిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ప్రకృతి వ్యవసాయంపై బీఆర్‌సీ పాయింట్ పర్సన్స్‌కు శిక్షణ

- మాకివలసలో రెండో రోజు కొనసాగిన శిక్షణ కార్యక్రమం
- కోడిగుడ్లు, నిమ్మరసం ద్రావణం తయారీపై ప్రదర్శన
- పంటల ఎదుగుదల, తెగుళ్ల నివారణలో వినియోగంపై అవగాహన

నరసన్నపేట, సెప్టెంబరు 3 (వార్త): ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు మెరుగైన అవగాహన కల్పించేందుకు బీఆర్‌సీ పాయింట్ పర్సన్స్‌కు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం నరసన్నపేట మండలం మాకివలస గ్రామంలో రెండో రోజు కొనసాగింది. స్థానిక బయో రిసోర్స్ ఇన్‌పుట్ సెంటర్ (బీఆర్‌సీ)లో జరిగిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా అన్ని రకాల పంటల్లో ఎదుగుదలకు, తెగుళ్ల నివారణకు ఉపయోగపడే కోడిగుడ్లు, నిమ్మరసం ద్రావణం తయారీ విధానాన్ని శిక్షణార్థులకు డెమో ద్వారా వివరించారు. అందుబాటులో ఉండే సహజ వనరులతో తయారు చేసే ఈ ద్రావణాలను ప్రకృతి వ్యవసాయంలో ఎలా వినియోగించాలనే అంశంపై ప్రదర్శన నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ తోట రమణ మాట్లాడుతూ కోడిగుడ్లు, నిమ్మరసంతో తయారు చేసే ద్రావణం పంటల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, కొన్ని రకాల తెగుళ్ల నియంత్రణకు ఉపయోగపడుతుందని వివరించారు. రైతులకు ఈ విధానాలపై సరైన అవగాహన కల్పించడం ద్వారా రసాయనాల వినియోగాన్ని తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించవచ్చని పేర్కొన్నారు. బీఆర్‌సీ పాయింట్ పర్సన్స్ గ్రామస్థాయిలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను రైతులకు చేరవేసి సహజ వ్యవసాయ విధానాల విస్తరణకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌సీ వనరుల వ్యక్తి జె. కమలమ్మతో పాటు బీఆర్‌సీ పాయింట్ పర్సన్స్ పాల్గొన్నారు.

5న అప్పయ్య దొర 13వ వర్ధంతి

పలాస, సెప్టెంబరు 3 (వార్త): దివంగత హనుమంతు అప్పయ్య దొర 13వ వర్ధంతి కార్యక్రమాన్ని సెప్టెంబరు 5న శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన జ్ఞాపకాలను స్మరించుకుంటూ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సందర్భంగా ఉదయం 9.30 గంటలకు కాశీబుగ్గలోని దొర గారి విద్యావనం వద్ద కార్యక్రమం నిర్వహించనున్నట్లు హనుమంతు రామ్మోహన్ దొర (బుజ్జి మాస్టర్) వెల్లడించారు. ఈ వర్ధంతి సభకు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, వైసిపి సీనియర్ నాయకులు హనుమంతు వెంకట్రావు దొర తోపాటు కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు, శ్రేయోభిలాషులు కార్యక్రమానికి హాజరై దివంగత అప్పయ్య దొరకునివాళులర్పించనున్నారని బుజ్జి మాస్టర్ తెలిపారు. సేవా భావంతో ప్రజలకు చేరువై, సామాజికంగా తనదైన ముద్ర వేసిన ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దొర అభిమానులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించడంతో పాటు, ఆయన ఆశయాలు, సేవలను స్మరించుకోనున్నారు.

Donate Blood - Save a

మధ్యలో పలు సేవా కార్యక్రమాలు

- ఘనంగా పొట్టి జనార్దన్, దండాసి వర్ధంతి
- పాఠశాల, శ్మశానాలకు ప్రహరీగోడలు
- మెడికల్, రక్తదాన శిబిరాలు

సందడిగా మారిన మధ్య గ్రామం

సేవలకు పలువురి అభినందనలు

మందస, సెప్టెంబరు 3(వార్త): ఆత్మీయుల జ్ఞాపకాలను సేవా కార్యక్రమాలుగా మలచి, సమాజానికి అండగా నిలవాలనే సంకల్పంతో పొట్టి జనార్దన్, పొట్టి దండాసి దంపతుల వర్ధంతి సందర్భంగా పిడిమందస పంచాయతీ మధ్య గ్రామంలో పలు సేవా కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. సేవా కార్యక్రమాలతో పొట్టి జనార్దన్ - పొట్టి దండాసి దంపతుల వర్ధంతి మధ్య గ్రామంలో నిర్మించిన పాఠశాలకు ప్రహరీగోడ, స్మశానవాటికకు ప్రహరీ గోడలను ప్రారంభించారు. అనంతరం మెడికల్, రక్తదాన శిబిరాలు జరిగాయి. పొట్టి జనార్దన్--పొట్టి దండాసి దంపతుల జ్ఞాపకార్థం మనవడు శ్రీవాసుదేవ పొట్టి శ్రీరాములు సేవా ట్రస్ట్ చైర్మన్ కొంకి భుజంగరావు ఆధ్వర్యంలో సొంత నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలను చేపట్టారు. గతంలో సుమారు రూ. లక్షల విలువైన ప్రయాణికుల విశ్రాంతి భవనాన్ని నిర్మించి, గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. తాజాగా వారి వర్ధంతి సందర్భంగా గ్రామంలోని పాఠశాల ప్రహరీ గోడ, స్మశానవాటిక ప్రహరీ గోడలను సొంత నిధులతో నిర్మించి ప్రారంభించారు. దీంతో పాటు గ్రామ ప్రజల కోసం ఉచిత మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరం నిర్వహించారు. మెడికల్ క్యాంపులో సుమారు 198 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అలాగే పేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ వాసుదేవ పొట్టి శ్రీరాములు సేవా ట్రస్ట్ ను ఏర్పాటు చేసి, ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, రక్తదానం, పేదలకు సహాయం తదితర సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కొంకి భుజంగరావు తెలిపారు.

ప్రభుత్వం ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి, చైతన్యవంతమైన సమాజ నిర్మాణంలో తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి పిసిని చంద్రమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ చైర్మన్ కొంకి భుజంగరావును అభినందించారు. ఆత్మీయుల జ్ఞాపకార్థం గ్రామానికి శాశ్వతంగా ఉపయోగపడే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గేదెల చైతన్య, పలాస నియోజకవర్గ సమన్వయకర్త డా.దుర్గారావు, జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ కంచరాన అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ పండా, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు, మందస మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాల్, మందస పీఏసీ డైరెక్టర్ పిన్నింటి వాసు, మందస మండలం టీడీపీ అధ్యక్షుడు బావన దుర్యోధన, మాజీ సర్పంచ్ గేదెల రామకృష్ణ, సేనాపతి ఉమామహేశ్వరరావు, డొక్క లక్ష్మీనారాయణ, అగ్గున్న జయరాజు, కుటుంబ సభ్యులు పొట్టి కోదండరావు, పొట్టి నీలకంఠం, జనసేన నాయకులు పందిరి నీలయ్య, రాపాక కేశవరావు, సందీప్, మహేష్, చండిరావు, బాబురావు, మురళి, యాదవరావు, పాపారావు, విశ్వనాథం తదితర జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీగురుకుల విద్యాలయంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- ఆటపాటలతో అలరించిన విద్యార్థులు
- కృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి

పలాస, సెప్టెంబరు 3 (వార్త): శ్రీగురుకుల విద్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యాలయం కరెస్పాండెంట్ కింతలి అశోక్ వర్ధన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలతో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుడి బాల్య ఘట్టాలను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక శోభను తెచ్చాయి. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, పండుగల విశిష్టతను తెలియజేసే ఉద్దేశంతో కార్యక్రమాలను నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో విద్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులను కరెస్పాండెంట్ అశోక్ వర్ధన్ అభినందించారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

ముందస్తు శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 3 (వార్త): స్థానిక స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రాంగణం లో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక స్వర్ణభారతి విద్యా సంస్థల ఛైర్మెన్ చాట్ల . తులసిదాస్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీ కృషుడి చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఏ ఎం సి మాజీ చైర్ పర్సన్ చాట్ల. సుజాత బాలకృష్ణుని వేషాధారణ లో ఉన్న చిన్నారులను ఆశ్వరదించారు. చిన్నారుల వేషాధారణ, వుట్టి సంబరం మొదలైన కార్యాక్ర ములు ఎంతో ఆకర్షించాయి. కార్యక్రమంలో స్వర్ణ భారతి హైసూల్ ప్రిన్సిపాల్ కే. శ్రీనివాస్, కవితా, గుణ ,వాలి, వైస్ ప్రిన్సిపాల్ బి. లోలా లక్ష్మి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సత్యసాయి స్కూల్లో ,రవీంద్ర భారతీ ,మున్సిపల్ పంజా వీధి ,ఈదుపురం శ్రీవిద్యా నికేతన్ పాఠశాల లలో వేడుకలు నిర్వహించారు.

వినాయక మండపాలకు సింగిల్ విండో అనుమతులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 2 (వార్త): ఇచ్ఛాపురం సర్కిల్ పరిధిలో టౌన్,రూరల్ పోలీస్ స్టేషన్ లు కవిటి స్టేషన్ పరిధిలో వినాయకచవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న మండపం నిర్వాహకులు వారు అందరూ వెబ్ సైట్ హ్ట్జుూం://స్ఘుఅవంష్ట్రబ్యిఖఙ.అవ్/ ద్వారా తమ వివరాలు ఆన్ లైన్ లో అప్లికేషన్ సబ్మిట్ చేసి సింగల్ విండో విధానం లో అనుమతులు పొందాలని సి ఐ ఎం చిన్నం నాయుడు చెప్పారు.గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కే.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు ఉత్తర్వులు జారీ చేయడమైనదని చెప్పారు.

చేపల మార్కెట్‌లో వ్యర్థాల తొలగింపు

- దుర్వాసనపై స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన ఈవో
- పారిశుధ్య కార్మికులతో చెత్త తొలగింపు
- ఇష్టానుసారంగా వ్యర్థాలు వేయొద్దని ప్రజలకు హెచ్చరిక

నరసన్నపేట, సెప్టెంబరు 3 (వార్త): నరసన్నపేటలోని చేపల మార్కెట్ పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు మేజర్ పంచాయతీ ఈవో పిల్ల జగన్మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై తక్షణమే స్పందించిన ఆయన గురువారం పారిశుధ్య కార్మికులను మార్కెట్‌కు పంపించి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. చేపల మార్కెట్‌లో రోజువారీగా ఏర్పడుతున్న వ్యర్థాలను కొందరు ఇష్టానుసారంగా పరిసర ప్రాంతాల్లో పడేయడం వల్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని ఈవో తెలిపారు. దీంతో మార్కెట్‌కు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులతో పాటు సమీప ప్రాంత ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు మార్కెట్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. ఇకపై ప్రజలు, వ్యాపారులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశించిన ప్రాంతాల్లోనే వేయాలని జగన్మోహన్‌రావు సూచించారు. పారిశుధ్య పరిరక్షణలో ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి సహకరించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత

నేతాజీకి అభినందనలు

జి.సిగడాం, సెప్టెంబరు 3 (వార్త): జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఏపీ మోడల్ స్కూల్ ఫిజిటి ఫిజిక్స్ ఉపాధ్యాయులు పిచ్చుక నేతాజి నకు పిన్సిఫల్ గణేష్ పట్నాయక్ అభినందించారు. గురువారం. ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయ యాజమాన్యం ,మండల ఉపాధ్యాయులు పలువురు హర్షం వ్యక్తం చేశారు. అంకితభావంతో విధులు నిర్వహించి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికకావడం ఆనందంగా ఉందని గణేష్ పట్నాక్ అన్నారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని విద్యాశాఖ ఎంపిక చేసిన ఈయెనకు జిల్లాకలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా విద్యాశాఖ అధ్యర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేస్తారని తెలిపారు.

ఇచ్ఛాపురం గ్యాస్ ఏజెన్సీ ..

అర్బన్‌లోకి మార్పు

- జాతీయ వార్త కథనానికి స్పందన
- ఫలించిన పోరాటం
- ఇక 25 రోజులకే గ్యాస్ బుకింగ్

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 2 (వార్త): ఇచ్ఛాపురం గ్యాస్ ఏజెన్సీ వినియోగదారుల కష్టాలు తీరానున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఉండే వెంకట సిద్ధ భైరవి ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ రూరల్ పరిధిలో ఉన్నట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. అర్బన్‌లో 25 రోజులు గడువు కాగా రూరల్ లో 45 రోజులు గడువు. కానీ ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో ఏజెన్సీ వినియోగదారులు 45 రోజులు గడువు తో గ్యాస్ పొందుతున్నారు.

ఈ సమస్య ఎప్పుడు ఉత్పన్నం కాకపో యినా ఇరాన్ యుద్ధం పుణ్యమా అని గ్యాస్ కొరత తో తెలిసి వచ్చింది. ఇదే విషయం పైన ఇప్పటికే 'గ్యాస్ దృష్టిలో ఇచ్ఛా పురం రూరల్' అనే వార్త కథనం వెలువడిన సంగతి తెలి సిందే. తెలుగుదేశం నాయకులు కూడా ధర్నా చేసిన విషయం విదితమే. వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి రెండు సార్లు గ్రీవెన్స్ సెల్ లో జిల్లా కలెక్టర్, మరియు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. ఎట్టకేలకు గ్రీవెన్స్ కి స్పందించి కలెక్టర్ కార్యాలయం నుంచి సమాధానం వచ్చినట్లు శ్యాం ప్రసాద్ రెడ్డి మీడియాకి తెలిపారు. శుక్రవారం నుంచి బుకింగ్‌లు 25 రోజులకి వర్తిస్తుందని చెప్పారు.

జలుమూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

- వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల రికార్డుల పరిశీలన
- సీజనల్ వ్యాధుల నివారణకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం

జలుమూరు, సెప్టెంబరు 3 (వార్త): జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ నరేష్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలతో పాటు వివిధ విభాగాలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న పలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను డీఎంహెచ్ఓ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా కార్యక్రమాల అమలు తీరు, ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణలో ఎప్పటికప్పుడు తాజా వివరాలను నమోదు చేస్తూ పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో వివిధ రకాల సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నరేష్‌కుమార్ ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. జ్వరాలు, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనుమానాస్పద కేసులు గుర్తించిన వెంటనే అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, సకాలంలో చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జి. సుజాత, డాక్టర్ ఎస్. అహల్య, సీహెచ్ఓ ఎస్. పద్మావతి, పీహెచ్ఎన్ ఎస్. పద్మావతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ యు. చిన్నరాజులు, సీనియర్ అసిస్టెంట్ విజయశాంతి, ల్యాబ్ టెక్నీషియన్ రాజారావు, స్టాఫ్‌నర్స్ లత, ఫార్మసిస్ట్ అప్పలరాజు, హెల్త్ అసిస్టెంట్ జి. చిన్నారావు, ఆయుష్ ఫార్మసిస్ట్ ఆర్. కృష్ణారావుతో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా సంధ్యారాణి

పలాస, సెప్టెంబరు 3 (వార్త): శ్రీకాకుళం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా పలాస మండలం సూదికొండ మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న తమ్మినేని సంధ్యారాణి ఎంపికయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సమగ్ర ప్రగతికి ఆమె చేస్తున్న కృషిని గుర్తించి ఈ గౌరవానికి ఎంపిక చేసినట్లు స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) ప్రతినిధులు తెలిపారు. ప్రాథమిక విద్యా దశలో విద్యార్థులకు పటిష్ఠమైన పునాది ఏర్పడేలా బోధనలో వినూత్న పద్ధతులను అవలంబిస్తూ, విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేందుకు సంధ్యారాణి చేస్తున్న కృషి ప్రశంసనీయమని. విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ పలాస శాఖ అధ్యక్షులు చందనరావు తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక కావడం సూదికొండ పాఠశాలకే కాకుండా పలాస మండలానికి గర్వకారణమని ఏపీఎస్టీఏ ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా తమ్మినేని సంధ్యారాణికి ఉపాధ్యాయులు, విద్యా రంగ ప్రముఖులు, పలాస మండలానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

ధర్మలక్ష్మీపురం ప్రధాన వీధిలో మురుగు

- దయనీయంగా పారిశుధ్య పరిస్థితులు
- కాలువల్లో పూడికతో రోడ్డుపైకి చేరుతున్న మురుగు నీరు
- స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి

సారవకోట, సెప్టెంబరు 3 (వార్త): ధర్మలక్ష్మీపురం గ్రామంలోని ప్రధాన వీధిలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో సరైన పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో ప్రధాన రహదారిపై మురుగు నీరు చేరి ప్రజల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. గ్రామంలోని మురుగు నీటి కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో నీరు సక్రమంగా ప్రవహించకుండా నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. కాలువలు పొంగిపొర్లి మురుగు నీరు రోడ్డుపైకి చేరుతుండటంతో పాదచారులు అదే నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు నీరు రోడ్డుపై నిరంతరం నిలిచి ఉండటం వల్ల దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు పెరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య సమస్య మరింత తీవ్రమయ్యేలోపు కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, మురుగు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సంబంధిత సచివాలయ సిబ్బంది, పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి ప్రధాన వీధిలో నెలకొన్న సమస్యను పరిశీలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలువల శుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుని గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచాలని కోరుతున్నారు.

నారాయణవలస సంతలో పశువుల అక్రమ రవాణా

- ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని ప్రజల ఆవేదన

నరసన్నపేట, సెప్టెంబరు 3 (వార్త): నారాయణవలసలో ప్రతీ గురువారం నిర్వహించే సంత సాక్షిగా పశువుల అక్రమంగా రవాణా జరుగుతోందంటూ స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చిన్న చిన్న వ్యానుల్లో తరలించి, అక్కడి నుంచి లారీల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశువులను వాహనాల్లో తరలించే సమయంలో వాటి భద్రత, సంక్షేమానికి సంబంధించిన నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల తరలింపులో చట్టపరమైన నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించి, అక్రమాలు ఉన్నట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

1-04-2026 శ్రీకాకుళం

'గ్యాస్' దృష్టిలో ఇచ్ఛాపురం 'రూరల్'

NO GAS
NO FOOD
Atidhi RESTAURANT

రావులవలస పాఠశాలలో

శిథిల భవనం కూల్చివేతకు తీర్మానం

- ప్రమాదకరంగా మారిన భవనాన్ని తొలగించాలని ఎస్ఎంసీ నిర్ణయం
- తీర్మాన ప్రతిని మండల విద్యాశాఖ అధికారులకు అందజేత
- ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు చేపట్టాలని హెచ్‌ఎం విజ్ఞప్తి

నరసన్నపేట, సెప్టెంబరు 3 (వార్త): రావులవలస పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేయాలని పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) గురువారం తీర్మానించింది. పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనం కారణంగా విద్యార్థులు, సిబ్బందికి ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో శిథిల భవనం తొలగింపుపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, కార్యవర్గ సభ్యుల సంతకాలతో తీర్మానాన్ని ఆమోదించారు. తీర్మాన ప్రతిని గురువారం మండల విద్యాశాఖ అధికారులకు అందజేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న శిథిల భవనాల వల్ల ముఖ్యంగా విద్యార్థులకు ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు పాఠశాలను పరిశీలించి భవనం పరిస్థితిని అంచనా వేయాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టి శిథిల భవనాన్ని తొలగించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఎంసీ కమిటీ సభ్యులు కోరారు.

పాఠశాలల్లో సందడిగా కృష్ణాష్టమి వేడుకలు

- కృష్ణుడు, రాధ వేషధారణల్లో చిన్నారుల సందడి
- ఉట్టి కొట్టే కార్యక్రమం, నృత్య ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు
- సారవకోట మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా ఉత్సవాలు

సారవకోట, సెప్టెంబరు 3 (వార్త): సారవకోట మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సెలవు ఉండటంతో పాఠశాలల్లో ఒక రోజు ముందుగానే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ పాత్రల వేషధారణలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థులు పాఠశాల ప్రాంగణాల్లో సందడి చేశారు. పలువురు విద్యార్థులు కృష్ణుడి బాల్య లీలలను గుర్తు చేసే విధంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధనలు విద్యార్థులకు ఆదర్శప్రాయమని ఉపాధ్యాయులు ఈ సందర్భంగా తెలిపారు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతి పట్ల చిన్నారుల్లో అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి పండుగ వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. కృష్ణాష్టమి వేడుకలతో పాఠశాల ప్రాంగణాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

వంశధార కాలువలో సాగునీరు లేక ఇబ్బందులు

-- కాలువల్లో గుర్రపుడెక్క, గడ్డి, మొక్కలు పెరిగిపోవడమే కారణం

- కాలువల శుభ్రతపై అధికారులు దృష్టి సారించాలని రైతుల విజ్ఞప్తి

నరసన్నపేట, సెప్టెంబరు 3 (వార్త): ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులకు పైగా గడుస్తున్నప్పటికీ వంశధార కాలువల ద్వారా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు వర్షాలు ముఖం చాటేయగా, మరోవైపు కాలువల ద్వారా సకాలంలో సాగునీరు అందకపోవడంతో పంటల సాగుపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వంశధార ప్రధాన కాలువలతో పాటు ఉప కాలువలు, పంపిణీ కాలువల్లో గుర్రపుడెక్క అధికంగా పేరుకుపోవడం, గడ్డి, ఇతర మొక్కలు విస్తారంగా పెరగడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. పలుచోట్ల కాలువలు పూర్తిగా పూడుకుపోయిన పరిస్థితులు కనిపిస్తున్నాయని, దీంతో నీరు చివరి ఆయకట్టు ప్రాంతాలకు చేరడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు సమయంలో పంటలకు నీరు అత్యవసరమైన దశలో కాలువల్లో సరైన నీటి ప్రవాహం లేకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షాభావ పరిస్థితులు కొనసాగితే పూర్తిగా సాగునీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే కొందరు రైతులు పంటల సాగుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ నీటి లభ్యతపై స్పష్టత లేక ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో పెరిగిన గుర్రపుడెక్క, గడ్డి, మొక్కలను తక్షణమే తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, ఆయకట్టు ప్రాంతంలోని ప్రతి రైతుకు సకాలంలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546